రాహుల్ ఆలోచనలకు విరుద్ధంగా ఫిరాయింపులు

- సంజయ్ చేరికను సీఎం రేవంత్‌రెడ్డే ప్రకటించారు
- పోచారంను చేర్చుకుని సలహాదారు పదవి ఇచ్చారు
- పార్టీని నమ్ముకున్న నాలాంటి వారికిది అవమానం
- పార్టీలో ఈ పరిణామాలను జీర్ణించుకోలేకపోతున్నా
- గంగారెడ్డి హత్యతో కాంగ్రెస్ కార్యకర్తల్లో ఆందోళన
- సోనియా, రాహుల్, ఖర్గేకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ

హైదరాబాద్, అక్టోబర్ 24(నమస్తే తెలంగాణ): తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న పార్టీ ఫిరాయింపులపై కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అధిష్ఠానానికి లేఖ రాశారు. పార్టీలోని ఈ పరిణామాలను తాను జీర్ణించుకోలేకపోతున్నానని ఆవేదన వ్యక్తంచేశారు. తన అనుచరుడి హత్యతో ఆవేదనకు గురైన జీవన్‌రెడ్డి పార్టీ చీఫ్ మల్లికార్జునఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్, అధిష్ఠానంలోని ఇతర పెద్దలకు లేఖ రాశారు. పార్టీ ఫిరాయింపులకు వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ మాట్లాడుతుంటే తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నదని ఆ లేఖలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించడాన్ని తాను జీర్ణించుకోలేకపోతున్నట్టు చెప్పారు. ఐదుసార్లు జగిత్యాల ఎమ్మెల్యేగా గెలిచిన తాను 40 ఏండ్లుగా కాంగ్రెస్‌లో ఉంటూ పార్టీకి సేవ చేస్తున్నట్టు తెలిపారు. ఇటీవల పార్టీలో జరుగుతున్న పరిణామాలు తనను ఎంతో ఆవేదనకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. దశాబ్దాలుగా పార్టీ బలోపేతానికి కృషి చేసిన మారు గంగారెడ్డిని ఎమ్మెల్యే సంజయ్ అనుచరుడిగా భావించే సంతోష్ కిరాతకంగా హత్య చేయడం కాంగ్రెస్ కార్యకర్తలను ఆందోళనకు గురిచేసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా దక్కకుండా చేసిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ ఫిరాయింపుదారులతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తే, దానికి రేవంత్‌రెడ్డి, దీపాదాస్ మున్షీ హాజరయ్యారని తెలిపారు. వారి నియోజకవర్గాల్లో ప్రభుత్వ పరంగానే కాకుండా పార్టీ పరంగా కూడా వారికే ప్రాధాన్యం ఇచ్చేలా, బాధ్యతలు అప్పగించేలా చేసిన తీరు తనను ఆందోళనకు గురించేసిందని తెలిపారు. సీపీఐతో కలిపి 66 స్థానాలతో కాంగ్రెస్ ప్రభుత్వం బలంగా ఉన్నప్పటికీ ఈ ఫిరాయింపులను ప్రోత్సహించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు.

ఫిరాయింపుల ముఠా నేత పోచారం

పార్టీ ఫిరాయింపులకు ముఠా నాయకుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అని జీవన్‌రెడ్డి ఆరోపించారు. ఆయనను పార్టీలో చేర్చుకోవడమే కాకుండా సలహాదారు పదవి కూడా ఇచ్చారని పేర్కొన్నారు. ఆయన ఇచ్చే సలహాలు కూడా ఫిరాయింపులపైనే ఉంటాయని ఎద్దేవా చేశారు. అభివృద్ధి నెపంతో ఫిరాయింపులకు పాల్పడడం, దీనికి ప్రభుత్వం తల ఊపడం దారుణమని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇదే కొనసాగితే దేశంలో ప్రజాస్వామ్యం, ప్రతిపక్షాలు ఉంటాయా? అని ప్రశ్నించారు. కొత్తగా పార్టీలో చేరిన వారు తమపై పెత్తనం చేయడం ఏమిటని మండిపడ్డారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన వారు ఆధిపత్యం చెలాయిస్తున్నారని ఆరోపించారు. పార్టీలోని పరిణామాలను జీర్ణించుకోలేకపోతున్నానని, మానసిక క్షోభను అనుభవిస్తున్నాని జీవన్‌రెడ్డి ఆ లేఖలో ఆవేదన వ్యక్తంచేశారు.

అనర్హత వేటు వేసే దమ్ముందా?

- పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలేవీ?
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రశ్న

నిజామాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్

ఖలీల్‌వాడి, అక్టోబర్ 24: కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ముంటే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసి ఎన్నికలు పెట్టాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతున్నదని, ఎన్నికలు వస్తే ప్రజలే తగిన సమాధానం చెబుతారని అన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై వేటు వేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై వేముల స్పందించారు. గురువారం నిజామాబాద్‌లో ఈఆర్‌సీ చేపట్టిన బహిరంగ విచారణకు మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్‌తో కలిసి హాజరైన ఆయన వేముల మీడియాతో మాట్లాడారు. 'పార్టీ మారిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై అనర్హత వేటు వేయాలని మీ పార్టీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డియే డిమాండ్ చేశారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించాలి. ఈ విషయంలో స్పీకర్ ప్రసాద్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి త్వరగా నిర్ణయం తీసుకోవాలి' అని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచక పాలనపై ప్రజలంతా ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా పోలీసులతో కలిసి అరాచక పాలన సాగిస్తున్నారని, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెడుతున్న తీరును ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. 'ముఖ్యమంత్రికి దమ్ముంటే జీవన్‌రెడ్డి చేసిన డిమాండ్ మేరకు పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసి ఎన్నికలు పెట్టాలి. ప్రజాక్షేత్రంలోకి వెళ్దాం. ప్రజలే న్యాయ నిర్ణేతలు. మీరు అనుసరిస్తున్న ప్రజా, రైతు వ్యతిరేక చర్యల మీద ప్రజలే తీర్పు చెబుతారు' అని అన్నారు.

ఫొటోలకు పోజులే తప్ప గింజ కొనలే..

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవమంటూ నాయకులు కొబ్బరికాయలు కొట్టి ఫొటోలకు పోజులిచ్చారని, కానీ ఇప్పటిదాకా ఒక్క గింజ కూడా కొనలేదని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. ధాన్యం సేకరణ ప్రారంభం కాలేదని, ఇప్పటికీ రైస్‌మిల్లులు కేటాయించలేదని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు దిక్కులేక దళారులకు అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ కలిపి రైతుకు క్వింటాకు రూ.2,800 రావాల్సి ఉండగా, కొనుగోలు కేంద్రాలు లేక దళారులకు అగ్గువకు అమ్మి నష్టపోతున్నారని తెలిపారు. గత పదేండ్లలో కేసీఆర్ ఉన్నంత కాలం రైతులు దళారులకు అమ్ముకోలేదని, కాంగ్రెస్ చేతగానితనం వల్ల ఇప్పుడు అమ్ముకోవాల్సి వస్తుందని విమర్శించారు. సన్న రకాలతో పాటు దొడ్డు రకాలకూ బోనస్ ఇవ్వాలని వేముల డిమాండ్ చేశారు.

కరెంటు కష్టాలు తీర్చిన ఘనత కేసీఆర్‌దే

- రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): తెలంగాణ కరెంటు కష్టాలు తొలగించిన ఘనత కేసీఆర్‌దేనని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర అన్నారు. కేసీఆర్ పాలనలో సగటు విద్యుత్తు వినియోగంలో, పంటల సాగులో తెలంగాణ జాతీయస్థాయిలో నంబర్ వన్ స్థాయికి చేరిందని తెలిపారు. హైదరాబాద్‌లో పరిశ్రమలు, ఐటీ అభివృద్ధి ఊహించని రీతిలో పరుగులు పెట్టిందని కొనియాడారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం డిస్కమ్‌లను అడ్డుపెట్టుకొని కరెంటును వ్యాపారంగా మార్చాలని చూస్తున్నదనని మండిపడ్డారు.

విద్యుత్తు చార్జీల పెంపు దుర్మార్గం

మొదటిపేజీ తరువాయి...

ప్రతిపాదనలు చాలా ఆశ్చర్యంగా, అభివృద్ధి నిరోధకంగా ఉన్నాయని తెలిపారు. చిన్న పరిశ్రమలకు, భారీ పరిశ్రమలకు ఇచ్చే కరెంట్‌కు ఒకే విధమైన రేటు కట్టడమంటే ఒకవిధంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమలకు ఉరి వేస్తున్నట్లేనని స్పష్టంచేశారు. ఈ కారణంగా రాష్ట్రం మొత్తం రోడ్డున పడే పరిస్థితి వస్తుందని, లక్షల మంది ఉపాధి కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న పరిశ్రమలు కూడా ఆగమయ్యేలా చార్జీలను పెంచాలని ప్రయత్నిస్తున్నదని దుయ్యబట్టారు. ఉచిత విద్యుత్తు భారాన్ని మధ్యతరగతి, చిన్నపరిశ్రమలు, భారీ పరిశ్రమలపై వేయాలని ఆలోచిస్తున్నదని ఆరోపించారు. డిస్కంలు ప్రతిపాదించిన 9 ప్రతిపాదనలను తిరస్కరించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ విద్యుత్తు రంగంలో ఎన్నో అవరోధాలను ఎదుర్కొని విజయాలు సాధించారని తెలిపారు. ఈ క్రమంలో ఎంత ఖర్చయినా ప్రజలపై భారం అసలే మోపలేదని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే బీ గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, బీఆర్ఎస్ నేతలు బహిరంగ విచారణకు హాజరయ్యారు.

చార్జీలు పెంపును అంగీకరించాలి..

చార్జీల పెంపుపై డిస్కంల ప్రతిపాదనలను అందరూ ఏకగ్రీవంగా అంగీకరించాలి. విద్యుత్తు సంస్థల కోసం చార్జీలు పెంచాలన్న నిర్ణయాన్ని స్వాగతించాలి.

– శశిభూషణ్, కిసాన్‌ఖేత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

మెదక్‌కు రేవంత్ అన్యాయం

- మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ) : మెదక్‌కు సీఎం రేవంత్‌రెడ్డి తీరని అన్యాయం చేశారని మాజీ ఎమ్మెల్యే, మెదక్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఆమె 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ.. మెదక్‌కు వైద్య కళాశాల మంజూరు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ మెదక్ వైద్య కళాశాల కోసం రూ.180 కోట్లు మంజూరు చేస్తూ 100 ఎంబీబీఎస్ సీట్లు కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. దీనికోసం మెదక్ పట్టణ శివారులోని మాతాశిశు సంరక్షణ కేంద్రం ప్రాంతంలో 14 ఎకరాలు స్థల సేకరణ చేయగా, అప్పటి వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా శంకుస్థాపన చేశామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మెదక్ వైద్య కళాశాలను 100 సీట్ల నుంచి 50 సీట్లకు కుదించారని ఆమె మండిపడ్డారు.

పత్తి రైతులను ఆదుకోండి

- అన్నదాతకు నష్టం చేకూర్చేలా రాష్ట్ర ప్రభుత్వ వైఖరి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో బోనస్ ఇప్పించాలి
- గవర్నర్‌కు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి వినతి

సూర్యాపేటలో గవర్నర్ జిష్ణుదేవ్ శర్మకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, చిత్రంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సూర్యాపేట, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): 'రాష్ట్ర రైతాంగం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నది. ముఖ్యంగా పత్తి రైతులు దారుణ పరిస్థితుల్లో ఉన్నారు. తెలంగాణ పత్తి రైతుల విషయంలో కేంద్రప్రభుత్వం తీరని అన్యాయం చేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వ వైఖరితో వరి పండించే రైతులకు తీవ్ర నష్టం కలిగించేలా ఉన్నది. పత్తి, వరి రైతులను ఆదుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడండి' అని గవర్నర్ జిష్ణుదేవ్ శర్మను మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి కోరారు. గురువారం సూర్యాపేటకు వచ్చిన గవర్నర్‌ను కలెక్టరేట్‌లో జగదీశ్‌రెడ్డి కలిసి రైతుల సమస్యలను వివరించి, వినతిపత్రం అందజేశారు. అనంతరం జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఇప్పటికే పత్తి చేతికి వస్తుండటంతో వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని తెలిపారు. వరదల్లో నష్టపోయిన పత్తి రైతులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు. అదే సమయంలో పత్తికి సంబంధించి రాష్ట్రం పట్ల కేంద్రం కూడా వివక్ష చూపిస్తున్నదని పేర్కొన్నారు. వాస్తవానికి గుజరాత్‌లో పండించే పత్తి కంటే తెలంగాణలో పండించే పత్తి నాణ్యమైందని అనేక సందర్భాల్లో సీసీఐ ప్రశంసించినట్టు గుర్తుచేశారు. గుజరాత్‌లో మాదిరి తెలంగాణ రైతాంగానికి క్వింటా పత్తి రూ.8,257 లెక్కన మద్దతు ధరను ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న రూ.475 బోనస్ అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు సీసీఐకి సంబంధించి కేంద్రాలను ప్రారంభించలేదని, అక్కడక్కడా ఒకటి, రెండు కేంద్రాలు తెరిచినప్పటికీ వచ్చిన పత్తిలో తేమశాతం ఎక్కువగా ఉన్నదని కొనుగోలు చేయడం లేదన్నారు. దీంతో రైతులు క్వింటాలు పత్తిని రూ.5వేలకు దళారులకు అమ్ముకొని దోపిడీకి గురవుతున్నారన్నారు. వడ్ల కొనుగోలుకు సంబంధించి ఇప్పటివరకు విధి విధానాలు సరిగ్గా లేవని తెలిపారు. ఈ విషయాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి రైతాంగాన్ని ఆదుకోవాలని గవర్నర్‌కు మెమొరాండం అందజేసినట్టు వెల్లడించారు.

పార్టీ ఫిరాయింపుల కేసు మరోసారి వాయిదా

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన శాసనసభ్యులపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ హైకోర్టులో మరోసారి వాయిదా పడింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట గురువారం పిటిషన్లు విచారణకు వచ్చాయి. వెంటనే ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి కల్పించుకొని కేసును సమగ్రంగా వాదించాల్సిన అవసరం ఉందని, వాయిదా వేయాలని కోరారు. వెంటనే పిటిషనర్ల తరపు న్యాయవాది రామచందర్‌రావు తీవ్ర అభ్యంతరం చెప్పారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై తక్షణమే అనర్హత వేటు వేయాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వం కావాలని గడువు కోరుతూ కాలయాపన చేస్తున్నదని అన్నారు. రెండు రోజుల వాదనలు కాగానే శని, ఆదివారాలు సెలవులు వస్తాయని, వాయిదా లేకుండా విచారణ జరగాల్సిన అవసరం ఉందని ఏజీ వివరణ ఇచ్చారు. దీంతో విచారణను నవంబర్ 4వ తేదీకి వాయిదా వేస్తున్నట్టు ధర్మాసనం ప్రకటించింది.

ఏక్‌పోలీస్ వ్యవస్థపై కమిటీ వేయండి

- సస్పెండ్ చేసినవారిని విధుల్లోకి తీసుకోండి
- సీఎంకు బీఆర్ఎస్ నేత ఆర్ఎస్పీ సూచనలు

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఏక్ పోలీస్ వ్యవస్థపై తక్షణం కమిటీ వేయాలని, సస్పెండ్ చేసిన బెటాలియన్ కానిస్టేబుళ్లను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని బీఆర్ఎస్ నేత, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్ల కోసం ఆందోళనలు చేస్తున్న పోలీసుల కుటుంబసభ్యులను పోలీసులే ఈడ్చి పడేస్తున్న వైనాన్ని ఆయన ఎక్స్ వేదికగా ఖండించారు. 'తమ భర్తలకు, కుటుంబాలకు న్యాయం కోసం పోరాడుతున్న కానిస్టేబుల్ భార్యపై యూనిఫాంలో ఉన్న కానిస్టేబుల్ చేయి చేసుకునే స్థాయికి పోలీసు డిపార్ట్మెంట్‌ను దిగజార్చారు రేవంత్ రెడ్డి గారు. తమరు నిజంగా చరిత్రలో నిలిచిపోతారు. టీజీఎస్పీలో కొత్తగా ప్రవేశపెట్టిన 'పర్మిషన్ విధానాన్ని' రద్దు చేయండి. ఏక్ పోలీసు వ్యవస్థపై కమిటీని ఏర్పాటు చేయండి. అన్ని విభాగాలను ఒకేలా చూడండి. పోలీసు లు రోబోలు కాదు.. మనుషులు అనేది గుర్తించండి' అంటూ ఆర్ఎస్పీ ట్వీట్ చేశారు.

వెట్టి బతుకులు.. సంచార జీవితాలు!

- 'బెటాలియన్' పోలీసుల అరణ్య రోదన
- 26 రోజుల డ్యూటీ తర్వాతే 4 రోజులు లీవ్
- భర్తల కోసం మిన్నంటిన భార్యల ఆందోళనలు
- 'ఒకే రాష్ట్రం.. ఒకే పోలీసు' ఉండాలని డిమాండ్

గుడిపేటలోని 13వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్ ముందు రహదారిపై ధర్నా చేస్తున్న కానిస్టేబుళ్ల భార్యలు, పిల్లలు

> వారంతా పోలీసుల భార్యలు.. తమ భర్తలు పడుతున్న ఇబ్బందులను చూడలేక రోడ్డు మీదకు వచ్చి నిరసన తెలిపారు.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఏక్ పోలీసు విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో ఊగిపోయిన పెద్దలు ఆ భార్యల భర్తలను గుర్తించి సస్పెండ్ చేసింది. ఇక్కడ హామీని నెరవేర్చాలని కోరడం నేరమా? లేక రాజుల కాలంలో మాదిరిగా నిలదీస్తే శిక్షించినట్టు ఇప్పుడు శిక్షించడమా?

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): బెటాలియన్ పోలీసు వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం రోజు రోజుకూ దిగజార్చుతుండటంతో తమ భర్తల కన్నీటి విధులను చూడలేక భార్యలే రోడ్లు ఎక్కి ఆందోళనలకు దిగాల్సిన దుస్థితి తెలంగాణలో వచ్చింది. ఇన్నాళ్లు 15రోజుల వరస డ్యూటీలను చేసుకొని నాలుగు రోజులు ఇంటికెళ్లి, పెండ్లాం బిడ్డలతో బతుకీడ్చుతున్న వారిపై 26 రోజులు కచ్చితంగా డ్యూటీ చేయాలనే కొత్త నిబంధనను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది. ఎన్నికల సమయంలో 'ఒకే పోలీసు వ్యవస్థ'ను తెలంగాణలో అమలు చేస్తామని ప్రగల్భాలు పలికిన నేతలు.. బెటాలియన్ పోలీసులను పెండ్లాం, బిడ్డలకు దూరం చేసేలా 26రోజుల నిబంధన తీసుకొచ్చారు. దీంతో పోలీసుల భార్యలు రగిలిపోతున్నారు. తమ నిరసనను తెలియజేయడానికి రోడ్ల మీదకు వచ్చారు. న్యాయం జరగకపోతదా అని అనుకున్నారు. కానీ ఆ భార్యల భర్తలను గుర్తించి సస్పెండ్ చేశారు. దీంతో 'మా గోడు వెల్లబోసుకున్నా కూడా.. మమ్మల్ని అరెస్టులు చేసి, మా భర్తలను సస్పెండ్ చేస్తారా?' అంటూ బాధిత మహిళలు బోరున విలపిస్తున్నారు. అనధికారికంగా 27 మందికి పైగా సస్పెండ్ అయినట్టు సమాచారం.

'ఏక్ పోలీస్' హామీ ఏమైంది?

అందరి పోలీసుల్లాగే తమ భర్తలు కూడా పరీక్షలు రాసి, ఫిజికల్ టెస్టుల్లో పాసై, 9 నెలలు కఠోర శిక్షణ తీసుకున్నవారేగా? వాళ్లకెందుకు మిగతా సివిల్, ఏఆర్ పోలీసుల్లాగా ఒకే చోట డ్యూటీలు వేయరు? వాళ్లేం తప్పు చేశారు? వాళ్లను కట్టుకున్న పాపానికి మేమేం తప్పు చేశాం? అంటూ బాధిత బెటాలియన్ కానిస్టేబుళ్ల భార్యలు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. 'మా భర్తలు ఏడాదికి మూడు జిల్లాలు తిరగాల్సి వస్తుంది. మేము ఎక్కడ ఉండాలి? మా బిడ్డలు ఎక్కడ చదువుకోవాలి? చేసేది పోలీసు ఉద్యోగమైనా ఈ తిరుగుడేంది?' అని ప్రశ్నిస్తున్నారు. పోలీసు ఉద్యోగం చేస్తున్న తమ భర్తలను తోటి పోలీసులే జీతగాండ్లలాగా చూస్తున్నారని.. పొద్దున్నే పలుగు, పారలతో గడ్డి పీకిస్తున్నారని కన్నీటి పర్యంతమవుతున్నారు. రాష్ట్రంలో సివిల్, ఏఆర్ పోలీసుల మాదిరిగానే బెటాలియన్ పోలీసులకు వారు కోరుకున్న జిల్లాల్లో కనీసం 3-5 ఏండ్లు ఒకే చోట పనిచేసే వెసులుబాటు కల్పించాలని ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. దీని వల్ల పిల్లల చదువులకు అంతరాయం లేకుండా ఉంటుందని, ఉద్యోగభారం తగ్గుతుందని చెబుతున్నారు.

గతంలో ఎలా ఉందంటే...?

గతంలో టీజీఎస్పీ బెటాలియన్లలో పని చేసే సిబ్బందికి 15 రోజులు డ్యూటీ ఉంటే ఎక్కడో మారుమూల స్టేషన్ నుంచి ఇంటి ప్రయాణానికి ఒకరోజు కేటాయించినా 3 రోజులు కుటుంబంతో గడిపే అవకాశం ఉండేది. ప్రస్తుతం 26 రోజులు డ్యూటీ చేసిన తర్వాత మాత్రమే నాలుగు రోజులు సెలవు తీసుకోవాలని నిబంధనను కొత్తగా వచ్చిన ఏడీజీ సంజయ్‌కుమార్ జైన్ తీసుకురావడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటామని పోలీసులు చెబుతున్నారు. రాష్ట్రంలో 13 బెటాలియన్స్ ఉన్నాయి. ఒక్కో బెటాలియన్‌లో 1500 మంది చొప్పున సిబ్బంది ఉంటారు. జిల్లా హెడ్‌క్వార్టర్‌లో కచ్చితంగా 200 మంది పహారా ఉంటారు. మిగిలిన వారిని ఏ బీ సీ డీ ఈ ఎఫ్ జీ కంపెనీలుగా విభజిస్తారు. ఒక్కో కంపెనీలో 118 మంది ఉంటారు. ఆ 118 మందిని 33, 33, 33గా విభజిస్తారు. ఆ 33 మందిలో ఆయా బెటాలియన్ పరిధిలోని ఒక పోలీస్ స్టేషన్ పరిస్థితులు, నేపథ్యం ఆధారంగా 12, 24, 33 మందిని కేటాయిస్తారు. అలా వెళ్లిన పీఎస్‌లో కనీసం 3 నెలలు డ్యూటీ చేయాల్సి ఉంటుంది. బెటాలియన్ పరిధిలోని అన్ని పీఎస్‌లకు రోటేట్ అవుతుండాలి. ఈ వ్యవస్థను మార్చేందుకు నాటి సీఎం కేసీఆర్.. సరిహద్దు రాష్ట్రాల్లోని విధానాన్ని అధ్యయనం చేయించారు. గెలిస్తే.. 'ఏక్ పోలీస్'ను ప్రవేశపెడదామనుకున్నారు. అయితే, ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నివేదికను తొక్కిపట్టి, 26రోజుల డ్యూటీ విధానాన్ని తీసుకొచ్చింది.

పోలీసుల జీవితాలతో ఆటలా?

- భార్యలు ఆందోళనలు చేస్తుంటే ప్రభుత్వానికి పట్టదా?
- మాజీ మంత్రి సబిత ఆగ్రహం

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): పోలీసుల జీవితాలతో ప్రభుత్వం ఆటలాడుతున్నదని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల భార్యలు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తుంటే ప్రభుత్వం పంతానికి పోతున్నదని ఎక్స్ వేదికగా పోస్టుచేశారు. 'మొన్న నల్లగొండ, నిన్న వరంగల్, నేడు సిరిసిల్ల, డిచ్‌పల్లి పోలీస్ బెటాలియన్లలో ఆందోళన చేస్తున్న పోలీసు కానిస్టేబుల్ భార్యల ఆవేదన అరణ్య రో దనేనా? మూడు రోజులుగా బెటాలియన్లలో పోలీస్ కానిస్టేబుళ్ల భార్యలు చేస్తున్న ఆందోళన ప్రభుత్వానికి పట్టదా? పోలీసు విధులు కాకుండా కూలీ పనులు చేయిస్తున్నారంటూ 17వ బెటాలియన్ పోలీసు భార్యలు ఆందోళనకు దిగటం ప్రభుత్వానికి సిగ్గుచేటు. భార్యలు రోడ్డెక్కితే భర్తలను సస్పెండ్ చేస్తారా? ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి ఇచ్చిన ఏక్ పోలీస్ ని నాదం ఏమైంది? ఇప్పటికైనా ప్రభుత్వం త న వైఖరిని మార్చుకొని రోడ్డు ఎక్కిన ఆడబిడ్డల గోడు పరిష్కరించండి' అంటూ సీఎం, డీజీపీని ఆమె ట్యాగ్ చేశారు.

పోలీసులా? కూలీలా?

మొదటిపేజీ తరువాయి...

ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొట్టకూటి కోసం పోలీసు ఉద్యోగంలో చేరిన తమ భర్తలతో ఉన్నతాధికారులు వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ఆరోపించారు. కూలీలకన్నా సెలవులుంటాయని, పోలీసులు మనుషులు కాదా? అంటూ ప్రశ్నించారు. టీజీఎస్పీ కానిస్టేబుళ్ల లీవ్ మాన్యూవల్ ప్రకారం తమ భర్తలు నెలకోసారి ఇంటికి వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భార్యా పిల్లల్ని, తల్లిదండ్రులను చూసుకోకుండా ఇష్టం వచ్చినట్లు, విరామం లేకుండా డ్యూటీలు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల మాదిరి విధానాన్ని తెలంగాణలోనూ అమలు చేయాలని, తెలంగాణ పోలీస్ బెటాలియన్‌లో ఆకస్మిక బదిలీలు లేకుండా ఐదేళ్ల పాటు ఒకే దగ్గర పనిచేసేలా పోస్టింగ్‌లు ఇవ్వాలని, సివిల్, ఏఆర్ పోలీసుల మాదిరిగా బెటాలియన్ పోలీసులకు విధులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిరిసిల్లల్లో డీఎస్పీ చంద్రశేఖర్ వారికి ఎంత నచ్చజెప్పినా శాంతించలేదు. దీంతో ధర్నా చేస్తున్న పోలీసు కుటుంబాల సభ్యులను స్థానిక పోలీసులు సర్దాపూర్‌లోని బెటాలియన్‌కు తరలించారు. ఎర్రవల్లి మండలంలోని జాతీయరహదారిపై ధర్నా కారణంగా మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌జాం అయ్యింది.

రోడ్డెక్కిన పోలీసు కుటుంబాలు

- ఒకే పోలీస్ విధానం ఉండాలని డిమాండ్
- 44వ జాతీయ రహదారిపై రాస్తారోకో
- మద్దతు ప్రకటించిన మాజీ మంత్రి కేటీఆర్

డిచ్‌పల్లిలో ఆందోళన చేస్తున్న మహిళలను బలవంతంగా పక్కకు లాక్కెళ్తున్న పోలీసులు

డిచ్